




కస్టమర్లకు వాహనాల వినియోగంపై వివరిస్తున్న సేల్స్‌మెన్

ఎలక్ట్రిక్ వాహనాల హవా

ఊపందుకుంటున్న అమ్మకాలు

- జీరో మెయింటెనెన్స్‌తో వినియోగదారుల మొగ్గు
- రిజిస్ట్రేషన్ చార్జీలు, లైఫ్‌టాక్స్ మినహాయింపు ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంపై ప్రజలు దృష్టిసారిస్తున్నారు. ప్రారంభంలో వచ్చిన సాంకేతిక లోపాలను కంపెనీలు అధిగమించడంతో ఎలక్ట్రిక్ బైక్‌లు, స్కూటర్లు, త్రీవీలర్, కార్ల అమ్మకాలు పెరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాలపై మొబిలిటీ ప్రమోషన్ స్కీమ్‌ను ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చార్జీలను రద్దు చేసింది. రోడ్ టాక్సును మినహాయించింది. దీంతో వినియోగదారులు ఎలక్ట్రిక్ వాహనాలను కొనేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

పెట్రోల్ ధరలు పెరగడంతో..

జిల్లాలో నాలుగేళ్ళుగా ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు జరుగుతున్నా గత కొద్ది నెలలుగా ఇవి ఊపందుకున్నాయి. పెట్రోల్ ధరలు రోజురోజుకు పెరగడం, ప్రజల్లో పర్యావరణ స్పృహరావడం ఇందుకు కారణం. జీరో మెయింటెనెన్స్‌తో ఒక యూనిట్ చార్జింగ్‌తో 100 కిలో మీటర్ల దూరం ప్రయాణించే అవకాశం ఉంది. జిల్లాలో ఎలక్ట్రిక్ కార్లు అమ్మే షోరూమ్‌లు 10, ద్విచక్ర వాహనాలు అమ్మే షోరూమ్‌లు 26 ఉన్నాయి. 2020 నుంచి 2024 నవంబర్ మూడో వారం వరకు జిల్లాలో 3,147 ఎలక్ట్రిక్ వాహనాలు రిజిస్టర్ అయ్యాయి. జిల్లాలో రిజిస్టర్ అయిన వాహనాల్లో ఆర్టీసీకి అద్దెకిచ్చిన 41 ఫైర్ బస్సులతోపాటు త్రీవీలర్లు 55, ప్యాసింజర్ ఆటోలు 34, మోటారు సైకిళ్లు, స్కూటర్లు 2,899 ఉన్నాయి. 118 కార్లు రిజిస్టర్ అయి కరీంనగర్ రోడ్లపై తిరుగుతున్నాయి.

అందుబాటులో ప్రముఖ కంపెనీల వాహనాలు

ప్రముఖ కంపెనీలైన టీవీఎస్, బజాజ్, ఓలా, ఏథర్, యాంపెర్ మరికొన్ని కంపెనీలు జిల్లా కేంద్రంలో షోరూంలను ఏర్పాటు చేసి ద్విచక్ర వాహనాల అమ్మకాలు సాగిస్తున్నాయి. ఈవీ వాహనాలకు కంపెనీలనుబట్టి 60 వేల నుంచి 1.85 లక్షల రూపాయల ధరలున్నాయి. 25 కిలోమీటర్ల వేగంలోపు ఈవీ వాహనాలకు రిజిస్ట్రేషన్ అవసరం లేదు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా ఏ ఎలక్ట్రిక్ వాహనానికి రిజిస్ట్రేషన్ చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదు. ఉచితంగానే ఈ వాహనాలను రిజిస్టర్ చేస్తారు.

బ్యాటరీలే భారం

ఎలక్ట్రిక్ వాహనాల వినియోగదారులకు బ్యాటరీలే భారంగా మారనున్నాయి. ఆయా కంపెనీలు వాహనాలను కొనుగోలు చేసిన వారికి మూడు నుంచి ఐదు సంవత్సరాలు మాత్రమే బ్యాటరీపై గ్యారంటీ ఇస్తున్నారు. ఆ తర్వాత వీరు బ్యాటరీ కొత్త బ్యాటరీ కొనాల్సి ఉంటుంది. ఒక్కో బ్యాటరీ ధర 70 వేల వరకు ఉంది. దీనిపై జీఎస్టీ అదనంగా చెల్లించాలి. వాహనంలో దాదాపు సగం ధర బ్యాటరీకే చెల్లించాల్సి రావడం

మిగతా 6వ పేజీలో...

చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటులో జాప్యం

జిల్లాకేంద్రంలో ఎలక్ట్రిక్ వాహనాలను చార్జి చేసుకునేందుకు ఈవీ చార్జింగ్ స్టేషన్లను నెలకొల్పాలని నిర్ణయించారు. ఇందుకోసం కలెక్టర్ 10 ప్రాంతాలను గుర్తించి నాలుగు ఏజెన్సీలకు వాటిని అప్పగించారు. ఏడాది క్రితమే వీరు అగ్రిమెంట్ చేసుకున్నా ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరిగిన నేపథ్యంలో చార్జింగ్ స్టేషన్లను నెలకొల్పడం అనివార్యంగా మారింది. తెలంగాణ పునరుత్పాదక శక్తి అభివృద్ధి సంస్థ (రెడ్‌కో) ఆధ్వర్యంలో ఈ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నారు. లీథియం సెల్స్‌తో కూడిన బ్యాటరీకి 3 సంవత్సరాలు లేదా 50 వేల కిలోమీటర్లు గ్యారంటీ ఇస్తున్నారు. 1 కిలో వాట్ బ్యాటరీ చార్జింగ్‌కు 1 యూనిట్ విద్యుత్ అవసరం ఉంటుంది. 2.2 నుంచి 5.1 కిలోవాట్ల బ్యాటరీ ఫుల్ చార్జింగ్‌కు రెండున్న ర గంటల నుంచి 5 గంటల సమయం తీసుకుంటుంది. ఒక్కసారి చార్జి చేస్తే 75 నుంచి 150 కిలోమీటర్ల దూరం ప్రయాణించవచ్చు. ఆయా కంపెనీల వాహనాల బ్యాటరీలను అనుసరించి చార్జింగ్ కెపాసిటీ, సమయం, ప్రయాణించే దూరంలో తేడాలున్నాయి.

రెడేళ్ల నుంచి ఎలాంటి సమస్య రాలేదు



\- యాగండ్ల శ్రీవైష్ణవి

రెండు సంవత్సరాల నుంచి ఓలా ఈవీ నడుపుతున్నాను. 14 వేల కిలోమీటర్ల దూరం తిరిగాను. ఇప్పటి వరకు ఎలాంటి సమస్య రాలేదు. కళాశాలకు ఈ వాహనంపైనే వెళుతున్నాను. 2022లో 1.25 లక్షలకు ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేశాను. గంటకు 100 కిలోమీటర్ల వేగం వరకు వెళ్లవచ్చు. ఫుల్ చార్జింగ్‌కు 5 గంటల సమయం పడుతుంది. లోకల్‌లో తిరిగేందుకు సౌకర్యవంతంగా ఉంది.

100 కిలోమీటర్ల ప్రయాణానికి రూ. 20 ఖర్చు



\- సుతారి శ్రీనివాస్, శివాజినగర్

18 నెలల క్రితం ఈవీ కొన్నాను. వారానికి నాలుగు యూనిట్ల విద్యుత్‌కు 20 రూపాయలు ఖర్చు అవుతుంది. గతంలో వారానికి 300 రూపాయల పెట్రోల్ ఖర్చు అయ్యేది. బ్యాటరీ సమస్య రాలేదు. జీరో మెయింటెనెన్స్ ఉంది.

నీడలేని వారికి అండగా..

- అభాగ్యులను ఆదుకుంటున్న నిరాశ్రయుల వసతి గృహం
- 30 మందికి భోజన వసతి



నిలువ నీడలేని వారికి అండగా నిలుస్తోంది కరీంనగర్ నిరాశ్రయుల వసతి గృహం. నగరంలోని కోతిరాంపూర్‌లో మెప్మా ఆధ్వర్యంలో ఈ వసతి గృహాన్ని ఏర్పాటు చేశారు. నగరంలో రోడ్లపై నిద్రించేవారికి, ఇక్కడికి వివిధ అవసరాల మేరకు వచ్చి రాత్రికి ఇళ్లకు వెళ్లలేక రాత్రి బస చేయాలనుకునే వారికి నైట్ షెల్టర్‌గా ఈ వసతి గృహాన్ని వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ 15 మంది ఆశ్రయం పొందుతున్నారు. మరికొంత మంది రాత్రి బస చేసి వెళ్లిపోతారు. ఇక్కడ ఆశ్రయం పొందుతున్న వారికి వీబీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భోజన వసతి కల్పిస్తున్నారు. అవసరమున్న వారికి వైద్య సహాయం అందిస్తారు.

\- కరీంనగర్ టౌన్, ఆంధ్రజ్యోతి

5

క్వాలిఫైడ్ డాక్టర్లు రాసిన మందులనే వాడాలి

సుభాష్‌నగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): క్వాలిఫైడ్ డాక్టర్ రాసిన ప్రిస్క్రిప్షన్ ప్రకారం మందులను వాడాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికార డాక్టర్ వెంకటరమణ సూచించారు. సోమవారం తన కార్యాలయంలో యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్‌పై రూపొందించిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ సూచించిన ప్రకారం కాకుండా తమను ఇష్టానుసారంగా మందులు వాడితే దానికి సంబంధించిన బాక్టీరియాలు యాంటి బయాటిక్స్ పని చేయకుండా నిరోధకత పొందుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధ, పీవోడీటీటీ డాక్టర్ ఉమాశ్రీ, పీవో ఎంసీహెచ్ డాక్టర్ సనా జువేరియా పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ సెపక్ తక్రా రాష్ట్ర చాంపియన్స్‌గా ఉమ్మడి జిల్లా

- ఫైనల్స్‌లో రంగారెడ్డిపై గెలుపొందిన బాలబాలికల జట్లు

\- కరీంనగర్ స్పోర్ట్స్, ఆంధ్రజ్యోతి

5

ధాన్యం కొనడం లేదని రైతుల ఆందోళన

- గోనె సంచులకు నిప్పుపెట్టి నిరసన

4

కిలో అదనంగా జోకినా కఠిన చర్యలు

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

\- గంగాధర, ఆంధ్రజ్యోతి

6

ప్రశాంతంగా గ్రూప్-3 పరీక్షలు

- 52.63 హాజరుశాతం నమోదు
- 12,513 మంది గైర్హాజరు
- స్ట్రాంగ్ రూమ్‌కు జవాబు పత్రాల తరలింపు


తిమ్మాపూర్‌లోని పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న అభ్యర్థులు

కరీంనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. సోమవారం రెండోరోజు నిర్వహించిన పరీక్షకు 26,415 మంది హాజరుకావలసి ఉండగా 13,902 మంది మాత్రమే పరీక్షలు రాశారు. 12,513 మంది గైర్హాజరు కావడంతో 52.63 హాజరుశాతం నమోదైంది. ఆది, సోమవారం రెండురోజులుగా నిర్వహించిన గ్రూప్-3 పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాలను, ఇతర సామగ్రిని బందోబస్తు మధ్య జడ్పీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. ఉదయం 8.30 గంటల వరకే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. 9.30 తర్వాత వచ్చిన అభ్యర్థులను లోనికి అనుమతించలేదు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేయడంతోపాటు సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను పరీక్ష సమయం ముగిసే వరకు మూసి వేయించారు. భారీ బందోబస్తును ఏర్పాటు చేసి హాల్ టికెట్లను పరిశీలించిన తర్వాతనే కేంద్రాలోకి అనుమతించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఎప్పటికప్పుడు పరీక్షా కేంద్రాల్లోని అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. జిల్లాలో గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, పటిష్టమైన ఏర్పాట్లతో ఎక్కడ ఏ చిన్న పొరపాటు కూడా జరుగలేదని ఆయన తెలిపారు. పరీక్షలను ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, ఆర్డీవో మహేశ్వర్, ఏసీపీ విజయ్‌కుమార్, గ్రూప్-3 పరీక్ష కో ఆర్డినేటర్లు వరలక్ష్మి, సతీష్‌కుమార్, సీఐలు కోటేశ్వర్, విజయ్‌కుమార్, జాన్‌రెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ కాశీచరణ్ పర్యవేక్షించారు.

దరఖాస్తుల ఆహ్వానం

సుభాష్‌నగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సినిమా టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ కోర్సులకు నిరుద్యోగ యువతీ యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని నాక్ అసిస్టెంట్ డైరెక్టర్ తెలిపారు. సోమవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన చేసిన విలేకరుల సమావేశంలో కోర్సుల వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాక్, శశి ప్రీతమ్ అకాడమి ఆఫ్ సినిమా ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా కోర్సులను నిర్వహిస్తున్నందన్నారు. సినిమాటోగ్రఫీ , సౌండ్ రికార్డింగ్, వీడియో ఎడిటింగ్, డిజిటల్ డిజైన్, సోషల్ మీడియా మేనేజ్‌మెంట్, ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్, యాంకరింగ్, ఈఎంసీఈఈ, డబ్బింగ్ వాయిస్ ఓవర్ స్కిల్స్, మ్యూజిక్ ప్రొడక్షన్ , ప్రొఫెషనల్ గానం శిక్షణ, అకౌస్టిక్ డిజైనింగ్ నైపుణ్యంలో శిక్షణ ఉంటుందన్నారు. మూడు నెలల వ్యవధి ఉన్న ఈ కోర్సు ఫీజు 35 వేల రూపాయలని తెలిపారు, అర్హత గల ఎస్సెస్సీ పాస్ ఆఫైన, పై కోర్సుల్లో ఆసక్తి ఉన్న వారు 9848827124, 9440462346, 9705049437 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి


దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

సుభాష్‌నగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో స్వీకరించే దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణిలో దరఖాస్తులను ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం ప్రజా దర్బార్ లాగిన్‌లో ఉన్న అన్నిదరఖాస్తులను వచ్చే నెల ఒకటవ తేదీ వరకు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అదనపుకలెక్టర్ లక్ష్మికిరణ్, జిల్లా మైనార్టీ అధికారి పవన్‌కుమార్, ఏవో సుధాకర్‌రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బకాయిలను విడుదల చేయాలి

భగత్‌నగర్: బెస్ట్ అవైలబుల్ స్కీం బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ, కేవీపీఎస్ గిరిజన సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు ప్రజావాణిలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో సోషల్‌వెల్ఫేర్, గిరిజన సంక్షేమ శాఖల సహకారంతో బెస్ట్ అవైలబుల్ స్కీం కింద దళిత, గిరిజన పిల్లలు చదువుకుంటున్నారన్నారు. ప్రతి ఏటా ఫీజులు చెల్లించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం 175 కోట్ల రూపాయలు బకాయిలు పెట్టిందన్నారు. దీంతో దళిత, గిరిజన విద్యార్థుల చదువులకు దూరమయ్యే పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి బకాయిలను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కంపెల్లి అరవింద్, గజ్జెల శ్రీకాంత్, కేవీపీఎస్ నాయకులు తిప్పారపు, బోడ మోహన్ నాయక్, సురేష్, సందేశ్, తేజ పాల్గొన్నారు.

21న మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్

కరీంనగర్ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ఈనెల 21న ఉదయం 10 గంటలకు మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ వెంకటేశ్వర్‌రావు, కె శంకర్, కోశాధికారి జి అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్, కొత్తపల్లి మండలాల వారికి విద్యానగర్ రత్నం హైస్కూల్‌లో ఈ పరీక్ష నిర్వహిస్తామన్నారు. పాఠశాల స్థాయిలో ఎంపికైన 8,9,10 తరగతి విద్యార్థులు ముగ్గురు కలిసి జట్టుగా ఈ పరీక్షకు హాజరుకావాలని సూచించారు. తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో వేర్వేరుగా జట్లు హాజరు కావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలల నుంచి వేర్వేరుగా ఎంపిక జరుగుతుందని తెలిపారు. ఇతర వివరాలకు జి అశోక్‌ను 94903-00725 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రూ.65 లక్షలతో పద్మనగర్ జంక్షన్ సుందరీకరణ

- డీపీఆర్ సిద్ధం చేయండి
- కలెక్టర్ పమేలా సత్పతి


పద్మనగర్‌లో జంక్షన్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-సిరిసిల్ల రోడ్డులోని పద్మనగర్ జంక్షన్‌ను 65 లక్షల రూపాయలతో సుందరీకరించాలని నిర్ణయించామని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ఇందుకు అవసరమైన డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)ను వెంటనే సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం పద్మనగర్ జంక్షన్ ఏర్పాటు కోసం స్థలపరిశీలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్మార్ట్‌సిటీలో భాగంగా ఈ జంక్షన్‌ను సుందరీకరి స్తామన్నారు. కార్యక్రమంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ పాల్గొన్నారు.

ఏడాది దాటినా ఎక్కడి పని అక్కడే..

చొప్పదండిలో ముందుకు సాగని రోడ్డు వెడల్పు పనులు

- ఇబ్బందుల్లో పట్టణవాసులు


చొప్పదండిలో డివైడర్ నిర్మించి వదిలేసిన రోడ్డు

చొప్పదండి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి పట్టణంలో ఆర్భాటంగా ప్రారంభించిన సెంట్రల్ లైటింగ్, రోడ్డు వెడల్పు పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. పనులు నిలిచిపోయి ఏడాది దాటినా పట్టించుకునేవారు లేరు. పనులు మధ్యలో నిలిపివేయడంతో రోడ్డు ఇరుకుగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి నిత్యం రాయపట్నం కరీంనగర్ మధ్యలో వందలాది భారీ వాహనాలు, కార్లు, బైక్, బస్‌లలో ప్రజలు ప్రయాణాలు కొనసాగిస్తుండగా ప్రతి రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

పట్టణంలోని గుమ్లాపూర్ క్రాస్ రోడ్ నుంచి డి86 కాలువ వరకు నాలుగు కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధికి 33 కోట్ల రూపాయలను 2022లో మంజూరు చేశారు. రోడ్డును వెడల్పు చేసి సెంట్రల్ లైటింగ్, ఇరు వైపులా మురికి కాలువలు, ఫుట్‌పాత్‌లను నిర్మించాలని నిర్ణయించారు. ఈ పనుల నిర్మాణానికి అప్పటి మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేయగా పనులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. కాంట్రాక్టర్లు రోడ్డు పనులు ప్రారంభించి రెండు వైపులా మురికి కాలువలు నిర్మించి ఉన్న రోడ్డు మధ్యలో డివైడర్లను నిర్మించారు. వెడల్పు చేయకుండా మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేయగా రోడ్డు ఇరుకుగా మారి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రోడ్డు వెడల్పు పనుల కోసం అధికారులు ఇళ్లకు మార్కింగ్ ఇచ్చారు. అభివృద్ధిని అడ్డుకోవద్దని కొందరు ఇళ్లను తొలగించుకున్నారు. ఇప్పటికైనా రోడ్డు పనులను చేపట్టి పూర్తి చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.


రోడ్డు వెడల్పు కోసం కూల్చివేసిన ఇల్లు

క్రైం కార్నర్

ప్రమాదవశాత్తు
రైలు కిందపడి వృద్ధురాలి మృతి

ఓదెల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఓదెల రైల్వే స్టేషన్‌లో సోమవారం పెద్దపల్లి మండలం కనగర్తికి చెందిన అరికిళ్ల నర్సమ్మ (60) అనే వృద్ధురాలు ప్రమాదవశాత్తు ఇంటర్ సిటీ రైలు కిందపడి మృతి చెందింది. ఓదెలలోని తన బంధువుల ఇంటిలో పెద్దఖర్మ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఇంటర్ సిటీ రైలులోతన భర్త నర్సయ్యతో ఓదెలకు వచ్చింది. రైల్వే స్టేషన్‌లో రైలు నుంచి దిగుతుండగా అకస్మాత్తుగా రైలు వేగం పుంజుకుంది. దీంతో ప్రమాదవశాత్తు కాలు జారడంతో రైలుకింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. రైలు కనీసం నిమిషం పాటు ఆగినా వృద్ధురాలి ప్రాణాలు దక్కేవని అక్కడున్న పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ...

మానకొండూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామానికి చెందిన బొడ్డు పోచమ్మ (85) అగ్నిప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. శ్రీనివాస్‌నగర్ గ్రామానికి చెందిన పోచమ్మ ఆదివారం సాయంత్రం ఇంట్లో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో మంటలు పోచమ్మకు అంటుకుని తీవ్రంగా గాయపడింది. కుటుంబ సభ్యులు పోచమ్మను కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ తెల్లవారు జామున మృతి చెందింది. తన తల్లి మృతిపై అనుమానం ఉందని పోచమ్మ కుమార్తె అలువాల లచ్చమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

బావిలో దూకిన వృద్ధురాలు

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని దమ్మక్కపేటకు చెందిన కొండ బత్తిని రాజేశ్వరి(65) బావిలో దూకింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేశ్వరి భర్త రాజాకిషన్ గత14 సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయనకు సేవ చేస్తూ మనస్తాపానికి గురైన రాజేశ్వరి సోమవారం ఉదయం బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. గమనించిన కుటుంబ సభ్యులు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని మోటార్ల సహాయంతో నీటిని తోడుతున్నారు. సాయంత్రం వరకు మృతదేహం లభించలేదు.

కొడుకు మృతి తట్టుకోలేక తండ్రి ఆత్మహత్య

ఇల్లందకుంట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న కోమటిపల్లి గ్రామానికి చెందిన మూడెండ్ల రవి (48) పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రవి కుమారుడు రెండు నెల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి రవి ముభావంగా ఉంటున్నాడు. ఈ నెల 16న పొలం వద్దకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయి రాత్రి అక్కడ పురుగుల మందు తాగాడు. తెల్లవారు జామున గమనించిన కుటుంబ సభ్యులు జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. రవిడి భార్య రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

పెద్దపల్లిటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీనగర్‌కు చెందిన సురెడ్డి దేవి ప్రసాద్‌రెడ్డి (50) అనే వ్యక్తి సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవి ప్రసాద్‌రెడ్డి కొన్నేళ్లుగా కాటారం మండలం గంగారంలో నివాసముంటూ హైదరాబాద్‌లో వ్యాపారం చేస్తున్నాడు. తనకు పెద్దపల్లిలో సొంత ఇళ్లు ఉంది. ఆ ఇంటిని గణేష్‌రెడ్డి అనే వ్యక్తి ఐదు లక్షల రూపాయలు అడ్వాన్స్‌గా తీసుకొని అద్దె లేకుండా ఇళ్లు అప్పగించాడు. సోమవారం పెద్దపల్లికి వచ్చిన ప్రసాద్‌రెడ్డి గణేష్‌కు ఫోన్‌చేసి ఇంటి తాళాలు తెప్పించుకొని నాలుగు గంటల వరకు ఇక్కడే ఉంటానని.. తర్వాత వచ్చి ఇంటికి తాళం వేసుకోమని గణేష్‌కు చెప్పాడు. దేవీప్రసాద్‌రెడ్డి భార్య రమ భర్తకు పలుమార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. నాలుగు గంటల సమయానికి గణేష్ వచ్చి డోర్లు కొట్టినా దేవీప్రసాద్‌రెడ్డి తలుపులు తీయకపోవడంతో కిటికిలోంచి చూసే సరికి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆత్మహత్యకు గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఏఎస్సై రామస్వామి వచ్చి ఘటన వివరాలు సేకరించారు. దేవి ప్రసాద్‌రెడ్డి మృతిపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

గంజాయి కేసులో
ఐదుగురు నిందితులకు జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో 2020, నవంబరు 10న జ్యోతినగర్‌లోని శివ టాకీసు వద్ద వాహనాల తనిఖీలో గంజాయితో పట్టుబడిన నిందితులకు కరీంనగర్ జిల్లా ఫస్ట్ అడిషనల్, సెషన్స్ కోర్టు సోమవారం ఐదు సంవత్సరాల జైలు శిక్ష, రూ.10వేల జరిమాన విధిస్తూ తీర్పు వెలువరించారు. కరీంనగర్ రెండో టాణ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. నిందితుల్లో ఒకరైన జాడి అజయ్ చనిపోగా, మిగిలిన నిందితులు సంగారెడ్డి జిల్లా వట్టిపల్లి మండలానికి చెందిన ఎర్రోల్ల రమేశ్, పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం రామారావుపల్లి గ్రామానికి చెందిన అన్నం కృష్ణ, రామడుగు మండలం వన్నారం గ్రామానికి చెందిన దుర్గం శ్రీధర్, కొతపల్లికి చెందిన మాడిశెట్టి రాజ్‌కుమార్‌లకు కోర్టు 5 ఏళ్ళ జైలుశిక్ష, పదివేల రూపాయల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

జమ్మికుంట రూరల్, నవంబర్ 18: జమ్మికుంట పట్టణ పరిధిలోని హౌసింగ్‌బోర్డు కాలనిలో తాళంవేసి ఉన్న ఇంట్లో దొంగతనం జరిగింది. రాజేందర్ అనే వ్యక్తి తన ఇంటికి తాళం వేసి స్వగ్రామం చెల్పూర్‌కు వెళ్లాడు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో దొంగలు ఇంటి తాళం పగులగొట్టి పదితులాల వెండి, ఐదు గ్రాముల బంగారు కమ్మలు, వెండి ప్రమిదలు, దుస్తులు ఎత్తుకెళ్లారు. వాటి విలువ రూ. 98 వేలు ఉంటుందని, ఇంటి యాజమాని ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

మహిళపై తెగిపడిన కరెంటు తీగ

● తప్పిన పెనుప్రమాదం

సుల్తానాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ట్యాంక్ రోడ్‌లో జన నివాసంలో ప్రమాదకరంగా ఉన్న ఎస్ఎస్-1 ట్రాన్స్‌ఫార్మర్ నుంచి పెంట రేణుక అనే మహిళ మీద కరెంటు వైర్ తెగి పడింది. సోమవారం ఉదయం మహిళా తన ఇంటి ఎదుట వాకిట్లో ముగ్గు వేస్తుండగా కరెంటు తీగ తెగిపడింది. తీగ ఆమె చీర చివరను తాకుతూ వెళ్ళడంతో తృటిలో పెనుప్రమాదం తప్పింది. ఆమె చీర కొంత వరకు కాలగా, చుట్టు పక్కల వాసులు ట్రాన్స్‌ఫార్మర్ ఎప్పుడు ఎవరి ప్రాణాలు బలిగొంటుందో అని భయాందోళన చెందుతున్నారు. ఇలాంటి సంఘటనలు ఇదివరకు కూడా జరిగాయని, కేవలం ప్రత్యామ్నాయ పనులు మాత్రమే చేస్తున్నారని, శాశ్వత పరిష్కారాన్ని చూపించాలని వారు కోరుతున్నారు. అధికారులు పట్టించుకుని ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే ప్రాంతానికి తరలించాలని విద్యుత్ అధికారులను ప్రజలు కోరుతున్నారు.

బైండోవర్ ఆంక్షలు ఉల్లంఘన

● లక్ష రూపాయల జరిమానా

పెద్దపల్లిటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలంలోని బొంపెల్లి గ్రామానికి చెందిన బోదాసు కనుకలక్ష్మి అనే మహిళ గుడుంబా విక్రయించినందుకు తహసీల్దార్ లక్ష రూపాయల జరిమానా విధించినట్లు ఎక్సైజ్ సీఐ నరేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో విధించిన బైండోవర్ ఆంక్షలన ఉల్లంఘించినందున జరిమానా వేసినట్లు తెలిపారు. ఎవరైన గుడుంబా విక్రయించిన, రవాణ చేసిన, తయారు చేసిన లక్ష రూపాయల జరిమానా లేదా ఏడాది జైలు శిక్ష విధించబడుతుందని సీఐ హెచ్చరించారు.

సీఎం పర్యటనకు భారీ ఏర్పాట్లు

● రేపు 'రాజన్న' దర్శనం.. బహిరంగ సభ
● గల్ఫ్ బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా
● యారన్ డిపో, ఎస్పీ కార్యాలయం ప్రారంభోత్సవం
● రూ.126 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం





వేములవాడ గుడి చెరువు మైదానంలో బహిరంగ సభ ఏర్పాట్లు



సిరిసిల్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి తొలిసారిగా ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి రానున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేస్తోంది. బుధవారం ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఇప్పటికే బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఏర్పాట్లపై దృష్టి సారించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం ఉదయం వేములవాడకు హెలికాప్టర్ ద్వారా చేరుకొని రాజరాజేశ్వరస్వామిని దర్శించుకుంటారు. అనంతరం గుడి చెరువు మైదానంలో బహిరంగ సభలో ప్రసంగి స్తారు. ఇదే క్రమంలో రూ.126 కోట్లతో వేములవాడ దేవస్థానానికి సంబంధించిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. నిధులకు సంబంధించిన జీవోలు కూడా సోమవారం జారీ చేశారు. మిడ్ మానేరు ప్రాజెక్టులో ముంపునకు గురైన 12 గ్రామాల నిర్వాసితు లకు సంబంధించి 4696 కుటుంబాలకు ఇళ్ల నిర్మాణా నికి రూ.237 కోట్ల నిధులు మంజూరు చేశారు. వీటికి సంబంధించి ప్రొసీడింగ్‌లు అదించే అవకాశం ఉంది. ఎంతో కాలంగా నేత కార్మికులు ఎదురుచూస్తున్నా యారన్‌డిపోను ప్రారంభించనున్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జీ-ప్లస్ 2 విధానంలో అధునిక వసతులతో నిర్మించిన జిల్లా పోలీస్ కార్యాలయాన్ని వేములవాడ నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారు. పోలీస్ కార్యాలయం ఇప్పటికే మూడుసార్లు వాయిదా పడడం గమనార్హం. ముఖ్యమంత్రి రాకకు సంబంధించి వేములవాడలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. హెలీప్యాడ్ తోపాటు భారీ షామీయానాలు సిద్ధం చేశారు.

గల్ఫ్ బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే గల్ఫ్ కార్మికులు, ఎన్ఆర్ఐల సంక్షేమంపై పాలసీ తీసుకొస్తామని ప్రకటించింది. ఇచ్చిన హామీ మేరకు గల్ఫ్ బాధిత కుటుంబాలకు రూ.5లక్షల ఆర్థిక సహాయం అందించడానికి శ్రీకారం చుట్టింది. డిసెంబరు 7, 2023 నాటి నుంచి గల్ఫ్‌లో మృతిచెందిన కార్మిక కుటుంబాలకు రూ.5లక్షల అర్థికసహాయం అందించాలని నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం వేములవాడలో బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన 17కుటుంబాలకు చెక్కులు అందించనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.85 లక్షలు కేటాయించింది. జిల్లాలో గల్ఫ్‌లో మృతిచెందిన కార్మికుల్లో గంగిపెల్లి తిరుపతి, దాసరి బాబు, కైర నాగయ్య, పోతుగంటి భూమయ్య, భైరి వెంకటేశం, ఎనుగుల భాస్కర్, బోయిని గణేష్, కారవాణి దేవయ్య, వికుర్తి ఎల్లంగౌడ్, పిట్ల మహేష్, గెరిగంటి అంజయ్య, సిలివేరి నాంపల్లి, దురిశెట్టి కొండయ్య, పెంద్యాల చంద్రకాంత్, మాదాసు విజయ్, పల్లి అంజయ్య, నిమ్మలరాజు ఉన్నారు. వీరి కుటుంబాలకు ముఖ్య మంత్రి చేతులమీదుగా చెక్కులు అందించే ఏర్పాట్లు చేశారు.

ధాన్యం కొనడం లేదని రైతుల ఆందోళన

● గోనె సంచులకు నిప్పుపెట్టి నిరసన



ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

సైదాపూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) వద్ద గోనెసంచులు యివ్వడం లేదని రైతులు సోమవారం ఆందోళన చేపట్టారు. అసహనానికి గురైన రైతులు గోనె సంచులను గడ్డిలో వేసి సొసైటీ గేటు ఎదుట తగలబెట్టి నిరసన తెలిపారు. చైర్మన్ బిల్ల వెంకట్రెడ్డిని సంచులు ఎందుకు ఇవ్వడం లేదని, ధాన్యం తూకాలు వేయడంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నారని రైతులు నిలదీశారు. వెంటనే ధాన్యం తూకం వేయాలని డిమాండ్ చేశారు. తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు లారీలు తెప్పించడం లేదని, ట్రాక్టర్ తో ధాన్యం తరలించడం వల్ల రైతులపై రవాణా చార్జీలు అదనంగా పడుతున్నాయని రైతులు తెలిపారు. సొసైటీలో అనేక అవకతవకలు జరుగుతున్నాయని, దానిపై విచారణ చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు. పది రోజులుగా రైతులు ఇబ్బంది పడుతుంటే పై అధికారులు కానీ, ప్రజా ప్రతినిధులు గాని ఎందుకు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సొసైటీ చైర్మన్, పాలకవర్గం, సిబ్బందిపై చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు.

వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు

కోరుట్ల రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకటాపూర్ వేంకటేశ్వర ఆలయ హుండీ లెక్కింపు సోమవారం దేవాలయ శాఖ, గ్రామ పెద్దల సమక్షంలో నిర్వహించారు. దేవాలయ - ధర్మాదాయశాఖ జగిత్యాల డివిజన్ ఇన్‌స్పెక్టర్ రాజమౌళి పర్యవేక్షనలో ఆలయ ఈవో విక్రం ఆధ్వర్యంలో హుండీ సొమ్ము లెక్కించారు. దేవాలయ ఆదాయం రూ. 73,365 నగదు, మిశ్రమ బంగారం 2 గ్రాముల 300 మిల్లీ గ్రాములు, మిశ్రమ వెండి 80 గ్రాములు వచ్చినట్లు అధికారులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తోట లింగారెడ్డి, దేవాలయ పురోహితుడు వెంకటరమణ, దేవాలయ చైర్మెన్ కటుకం రాజేశం, గ్రామస్థులు, భక్తులు ద్యాగ రాజిరెడ్డి, పోతుగంటి రాజేశం గౌడ్, పిట్టల రమేష్, బక్కం నర్సయ్య పాల్గొన్నారు.



హుండీ లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

భర్త ఇంటి ఎదుట భార్య ఆందోళన



కూతురు, కుమారుడితో కలిసి ఆందోళన చేస్తున్న వనిత

కోరుట్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పిల్లలతో పాటు తనను మానసిక వేదనకు గురిచేస్తూ మరో అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడని ఆరోపిస్తూ భర్త ఇంటి ఎదుట వివాహిత తన పిల్లలతో సోమవారం ఆందోళకు దిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం... కోరుట్ల పట్టణానికి చెందిన వినోద్ కుమార్‌తో 24 ఏళ్ల క్రితం పట్టణానికి చెందిన వనితకు వివాహం అయింది. దంపతులకు కొడుకు మనీష్, కూతురు మాళవిక ఉన్నారు. మూడేళ్ల క్రితం నుంచి భర్త వినోద్ కుమార్ పిల్లలతో పాటు భార్య వనితను మానసికంగా హింసిస్తున్నాడు. వేధింపులు భరించలేక వనిత తన పిల్లలతో కలిసి పట్టణంలో మరో ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటోంది. నాలుగు నెలల క్రితం వినోద్ కుమార్ మరో మహిళను వివాహం చేసుకున్నాడని తెలుసుకున్న వనిత భర్తను నిలదీసింది. తనకు తెలియకుండా మరో పెళ్లి చేసుకున్నాడని, ఇంటి ఖర్చులకు కూడా డబ్బులు ఇవ్వడం లేదని తనకు న్యాయం చేయాలని సోమవారం ఆందోళనకు దిగింది. వివాహిత చేస్తున్న ఆందోళనకు మహిళా సంఘ సభ్యులు మద్దతు పలికారు. ఆందోళ చేస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడ చేరుకుని ఆమెను సముదాయించి ఆందోళన విరమించాలని సూచించారు. అనంతరం పోలీసులు దంపతులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపిచేశారు.

జాతీయ స్థాయి క్రీడలకు ఎంపిక



దిలీప్

బీర్‌పూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగేళ గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైయ్యాడు. బీర్‌పూర్ మండలంలోని మంగేళ గ్రామం నుంచి నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడిన గోండుగుడెం గ్రామపంచాయతీకి చెందిన శకుంతల దిలీప్ ములుగు జిల్లాలో ఇంటర్ రెండవ సంవత్సం చదువుతున్నాడు. దిలీప్‌కు చిన్నా నాటి నుంచి కబడ్డీ అంటే ఇష్టం ఉండంతో క్రీడలపై ఉన్న మక్కువతో జిల్లా, రాష్ట్ర స్థాయిలో పతకాలను సాధించి హర్యానా రాష్ట్రంతో జరుగబోయే జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక అయ్యాడు. అంతే కాకుండా రాష్ట్ర జట్టుకు ప్రాతినిత్యం (కెప్టెన్)గా బాధ్యత వహిస్తున్నాడు. దిలీప్ జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికై రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనుండడంతో తల్లి దండ్రులు, స్నేహితులు, మండల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జోనల్ మీట్‌లో
గురుకులం విద్యార్థినుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

తంగళ్లపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో నిర్వహించిన తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలల 10వ జోనల్ మీట్‌లో తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. అండర్-14 విభాగంలో ఖో, ఖోలో ప్రథమస్థానం, అండర్-17 విభాగంలో బ్యాడ్మింటన్ జట్టు ప్రథమస్థానం, అండర్-19 విభాగంలో బ్యాడ్మింటన్ జట్టు ప్రథమ స్థానాల్లో నిలిచాయి. హ్యాండ్‌బాల్ జట్టు ద్వితీయ స్థానం సాధించింది. అథ్లెటిక్స్ అండర్-17లో హైజంప్‌లో రుషిత గోల్డ్‌మెడల్, డిస్క్ త్రోలో శరణ్య సిల్వర్ మెడల్, 3కే రన్‌లో సుచరిత సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నారు. ఈ సదర్భంగా సోమవారం మార్నింగ్ అసెంబ్లీలో ప్రిన్సిపాల్ పద్మ, వైస్ ప్రిన్సిపాల్ రమ్యకృష్ణ, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ వింధ్య మాలతి, పీడీ అలేఖ్య, పీఈటీ జ్యోతి విద్యార్థినులను అభినందించారు.

ఇద్దరిపై కేసు నమోదు

కరీంనగర్ క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పోలీస్ సైరన్ వేసుకొని వెళ్తున్న ఒక కారు డ్రైవర్‌తో పాటు రాయల్ ఎన్‌ఫీల్డ్ సైలెన్సర్ మార్చి తిరుగుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. కారు, రాయల్ ఎన్‌ఫీల్డ్ సీజ్ చేసి స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

విగ్రహాల తయారీతో ఉపాధి

● మహనీయులు, దేశ నేతలు, దేవుళ్ల విగ్రహాల తయారీ



నాలుగు సింహాల విగ్రహం

వేములవాడటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చిన్నతనం నుంచి చిత్రకళ ఇష్టం. దానితోపాటు మట్టితో విగ్రహాలను చేయడం అలవాటుగా చేసుకున్నాడు. ఇప్పుడు అదేకళను ఉపాధిగా మార్చుకున్నాడు. దేశ నేతలు, దేవుళ్ల విగ్రహాల తయారీతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. వేముల వాడ మండలం సంకెపల్లికి చెందిన బుర్రవేణు చిన్నప్పటి నుంచి చిత్రకళ, శిల్ప కళపై దృష్టి సారించాడు. పెద్దపల్లి సత్యంఅనే సీనియర్ శిల్పకారుడి వద్ద చేరి శిల్పకళలోని మెళకువలను తెలుసుకున్నాడు. చిత్రకళలో పోటీ ఎక్కువగా ఉండడంతో వేణు విగ్రహాల తయారీవైపు దృష్టిసారించాడు. మహనీయులు, దేశ నేతలు, దేవతల విగ్రహాల తయారీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నాడు. దేశ నేతలైనగాంధీ, అంబేద్కర్, అల్లూరి సీతరామారాజు, ఛత్రపతి శివాజీ విగ్రహాల తయారీతో అందరి దృష్టిని ఆకర్షించాడు. అతడితోపాటు మరో ఎనిమిది మంది యువకులకు ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. తమిళనాడు, మహారాష్ట్రతో పాటుగా తెలుగు రాష్ట్రాల్లోని నిజామాబాద్, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి, హైదారాబాద్, రంగారెడ్డి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల, కర్నూల్, కడప, విజయవాడ జిల్లాలో సుమారుగా 1800 వరకు విగ్రహాలను తయారు చేసినట్లు వేణు తెలిపాడు.



శివుడి విగ్రహంతో బుర్ర వేణు



బుర్ర వేణు తయారు చేసిన దొడ్డి కొమురయ్య విగ్రహం

పలువురికి ఉపాధి కల్పిస్తున్నా..

మాది నిరుపేద గీతకార్మిక కుటుంబం. మొత్తం ఆరుగురం సభ్యులం. చిన్నతనం నుంచి చిత్ర కళ ఆసక్తి. కుటుంబ పరిస్థితి బాగాలేక శిల్పాలు తయారీ నేర్చుకున్నా. అన్ని జిల్లాల నుంచి ఆర్డర్లు వస్తాయి. ప్రస్తుతం పలువురికి ఉపాధి కల్పిస్తున్నా.

- బుర్ర వేణు, శిల్పకారుడు, సంకెపల్లి



నిరాశ్రయుల వసతి గృహంలో వృద్ధులు



నిరాశ్రయుల వసతి గృహం

నీడలేని వారికి అండగా..

- అభాగ్యులను ఆదుకుంటున్న నిరాశ్రయుల వసతి గృహం
- 30 మందికి భోజన వసతి

కరీంనగర్ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పేగు తెంచుకొని పుట్టిన ఎంతోమంది కన్నబిడ్డలే తల్లిదండ్రుల ఆలనాపాలన చూడని ప్రస్తుత రోజుల్లో ఎవరూ లేని అభాగ్యులకు అండగా నిలుస్తోంది కరీంనగర్‌లోని నిరాశ్రయుల వసతి గృహం... మెప్మా ఆధ్వర్యంలో ప్రభుత్వ భవనంలో ఏర్పాటు చేసిన నగర నిరాశ్రయుల వసతి గృహం ఎంతో మంది అభాగ్యులను అక్కున చేర్చుకుంటోంది. నగరంలోని కోతిరాంపూర్‌లో రెండంతస్తుల భవనంలో మెప్మా ఆధ్వర్యంలో పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని ఏర్పాటు చేశారు. గతంలో ఓ స్వచ్ఛంద సంస్థకు ఈవసతి గృహం నిర్వహణ బాధ్యతను అప్పగించగా వారు అభాగ్యులను అక్కున చేర్చుకొని వారికి భోజనంతోపాటు వసతి కల్పించారు. నగరంలోని రోడ్ల పైనే నిద్రించేవారికి, ఇక్కడికి వివిధ అవసరాల మేరకు వచ్చి రాత్రికి ఇళ్లకు వెళ్లలేక రాత్రి బస చేయాలనుకునే వారికి నైట్ షెల్టర్‌గా ఈ వసతి గృహాన్ని వినియోగిస్తున్నారు. రోడ్ల పక్కన, జంక్షన్లలో, బస్టాండ్లలో రాత్రి పడుకునే అనేక మందిని పోలీసులు ఈ వసతి గృహానికి తరలిస్తారు. వారికి రాత్రి బస కల్పించి, ఉదయం వారిని బయటకు పంపిస్తారు. ఇలా దాదాపు 10 సంవత్సరాలుగా నీడలేని వారికి అండగా నిలిచిస్తోంది.

● వీబీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

2023 నవంబరునుంచి వీరబ్రహ్మేంద్రస్వామి ఫౌండే షన్ ఆధ్వర్యంలో ఈ వసతి గృహాన్ని నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ గృహంలో 15 మంది ఎవరూ లేని అభాగ్యులు ఆశ్రయం పొందుతున్నారు, ప్రతిరోజు మరో 15 నుంచి 20 మంది వరకు నైట్ షెల్టర్‌కు వచ్చి నిద్రిం చి ఉదయమే వెళ్లిపోతున్నారు. మెప్మా ఈ వసతి గృహం వీబీ ఫౌండేషన్‌కు నెలకు కేవలం 40వేల రూపా యలు నిర్వహణ ఖర్చులకోసం ఇస్తోంది. గత ఏడాది నుంచి వీబీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఆర్థిక సహాయాన్ని తీసుకోలేదు. అయి నా ఉదయం టిఫిన్స్, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో చక్క టి భోజనం, వసతి కల్పిస్తున్నారు. ఎవరికైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యపరీక్షలు చేయించి అవసరమైన వారికి చికిత్సతోపాటు మందులు కూడా ఇప్పిస్తున్నారు. ఆశ్రయం పొందుతున్న 15 మందిలో నలుగురు మహిళలు కాగా, 11మంది పురు షుల. వీరిలో ఒకరు వంట మనిషిగా, మరొకరు హెల్పర్ గా సేవలందిస్తున్నారు.

● అభాగ్యులకు సేవచేయడం అదృష్టం



కొన్ని సంవత్సరాలుగా హౌసింగ్‌బోర్డుకాలనీలో శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి అనాథ వృద్ధుల ఆశ్రమం నిర్వహిస్తున్నాను.. అభాగ్యులకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. మెప్మా పీడీ రవీందర్ గత నవంబర్‌లో ఈ వసతి గృహ నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. వసతిగృహంలో ఉండే వారికి ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందించాలని, రాత్రి వేళల్లో నైట్‌షెల్టర్‌గా రోడ్లపై నిద్రించే వారికి బస కల్పించాలని సూచించారు. నేను రాత్రి ఇక్కడికి వచ్చే వారికి కూడా భోజనం పెడుతున్నాను.. ఏడాది నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ప్రభుత్వం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆర్థిక సహాయాన్ని అందిస్తే ఎంతమందికైనా ఇక్కడ వసతి కల్పించి సేవ చేస్తా.

- సీపెల్లి వీరమాధవ్, వీబీ పౌండేషన్ చైర్మన్

● మూడేళ్లుగా ఉంటున్నా



ఎవరూ లేని నన్ను కరీంనగర్ బస్టాండ్ నుంచి తీసుకువచ్చి ఈ వసతిగృహంలో చేర్పించారు. మూడేళ్లుగా ఇక్కడే ఉంటున్నా.. అన్ని వసతులు బాగానే ఉన్నాయి. నాకు కళ్ళు కనిపించడం లేదు.. ఆపరేషన్ చేయిస్తే బాగుండు..

- రజియా

● మూడు పూటలా భోజనం పెడుతున్నారు...



కొడుకులు, బిడ్డలు లేరు... యేడాది నుంచి నేను ఇక్కడనే ఉంటున్నా... భోజనం బాగుంటుంది. పొద్దున నాకు తిండి పెట్టి ఆశ్రయం ఇస్తున్నారు.. చల్లగా ఉండాలి.

-నర్సమ్మ

కూలీ పనిచేసుకొని జీవిస్తున్నాను



కూలీనాలీ చేసుకొని జీవిస్తున్నాను... నాకు ఎవరూ లేరు.. ఆస్తిపస్తులు ఏమి లేవు.. సంవత్సరం నుంచి ఇక్కడే ఉంటున్నా. నాకు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డులు కూడా లేవు.. ప్రభుత్వం ఇలా భోజనం పెట్టించి ఆదుకుంటుంది.

- రేవెళ్ల శ్రీనివాస్

ఢిల్లీలో దోస్తీ... గల్లీలో కుస్తీ

- మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ విజయకేతనం
- మంత్రి పొన్నం ప్రభాకర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్

గోదావరిఖని, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పదేళ్లలో బీజేపీతో స్నేహంచేసి ఢిల్లీలో దోస్తీ, గల్లీలో కుస్తీగా వ్యవహరించిందని రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. సోమవారం మహారాష్ట్రలోని రాజురకు ఎన్నికల ప్రచారనికి వెళుతున్న ఆయన రామగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌తో కలిసి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒకటేనని, వారి దోస్తీ ప్రజలకు తెలుసునన్నారు. కేటీఆర్ మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయవద్దని చెప్పడం పరోక్షంగా బీజేపీకి ఓటు వేయాలనే సంకేతాన్ని ఇచ్చారన్నారు. ఈ నెల 24న మహారాష్ట్రలో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేటీఆర్ కాంగ్రెస్‌కు కవచంగా ఉంటుందని మాట్లాడడం విడ్డూరంగా ఉందని, సిద్ధాంతాల పరంగా బీజేపీ కాంగ్రెస్‌కు బద్ధ శత్రువన్నారు. పదేళ్ల కాలంలో పార్లమెంట్‌లో బీజేపీ ఏ బిల్లు ప్రవేశపెట్టినా బీఆర్ఎస్ ఎంపీలు మద్దతు పలికింది వాస్తవం కాదా అని అన్నారు. పదేళ్లలో జరిగిన అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్ వేయగానే కేసీఆర్, కేటీఆర్ ప్రధాని నరేంద్రమోదీ శరణు కోరుతున్నారని, అవినీతితో కోట్లు దోచుకున్న కేసీఆర్, కేటీఆర్‌పై చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయని, ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలను ప్రజలకు నెరవేర్చడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆయన చెప్పారు. సమావేశంలో మేయర్ బంగి అనిల్‌కుమార్, నాయకులు దీటి బాలరాజు, ఎండీ ముస్తాఫా, తిప్పారపు శ్రీనివాస్, పాతిపెల్లి ఎల్లయ్య, గట్ల రమేష్, కళ్యాణి సింహాచలం, గుంపుల తిరుపతి పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ సెపక్ తక్రా రాష్ట్ర చాంపియన్స్‌గా ఉమ్మడి జిల్లా

- ఫైనల్స్‌లో రంగారెడ్డిపై గెలుపొందిన బాలబాలికల జట్లు



రాష్ట్ర చాంపియన్స్‌గా నిలిచిన ఉమ్మడి జిల్లా బాలబాలికల జట్లు

కరీంనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-17 సెపక్‌తక్రా రాష్ట్ర చాంపియన్లుగా ఉమ్మడి కరీనగర్ జిల్లా బాలబాలికల జట్లు నిలిచాయి. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో ఈ నెల 16, 17, 18 తేదీల్లో జరిగిన అండర్-17 ఎస్‌జీఎఫ్ సెపక్ తక్రా రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్లు విశేష ప్రతిభ చాటాయి. సోమవారం జరిగిన ఫైనల్స్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్లు బాలబాలికల విభాగంలో రంగారెడ్డి జట్లపై గెలుపొంది టోర్నమెంట్ చాంపియన్స్‌గా నిలిచాయి. బాలుర జట్టు నుంచి ఆర్ మోహన్ అఖిరా నందన్, సాయి వర్ధన్, శ్రీరామ్, రెహమాన్‌లు పాల్గొని విజేతలుగా నిలవగా, బాలికల జట్టు నుంచి పూజ, అక్షయ, కవిత, హన్సిక, నక్షత్రాలు పాల్గొని విజేతలుగా నిలిచి చాంపియన్‌షిప్ సాధించాయి. రాష్ట్ర చాంపియన్లుగా నిలిచిన బాలబాలికల జట్లకు కోచ్‌లుగా జి కుమార్, మేనేజర్‌గా శివకృష్ణలు వ్యవహరించారు. రాష్ట్ర చాంపియన్లుగా నిలిచిన జట్లను జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్‌వి జనార్ధన్‌రావు, జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి బి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఎస్‌జీఎఫ్ ప్రధాన కార్యదర్శి బి వేణుగోపాల్, సెపక్‌తక్రా అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి అభినందించారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు చెల్పూర్ విద్యార్థి ఎంపిక



సూత్రాల హర్షిత్

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్పూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి చదువుతున్న సూత్రాల హర్షిత్ అనే విద్యార్థి జాతీయ స్థాయి హాకీ పోటీకలు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, పీడీ శ్రీనివాస్‌లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హర్యానాలో ఈ నెల 22 నుంచి 27 వరకు జరగనున్న హాకీ పోటీల్లో హర్షిత్ రాష్ట్రం తరపున ఆడతాడని తెలిపారు.



కోటిలింగాల వద్ద గోదావరి హారతి ఇస్తున్న అర్చకులు

కోటిలింగాలలో వైభవంగా గోదావరి హారతి

వెల్గటూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మూడవ సోమవారం సందర్భంగా కోటిలింగాలలో గోదావరి హారతి కార్యక్రమాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మలు శ్రీ పార్వతి కోటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి పంచామృత అభిషేకాలు వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివనామ స్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. అర్చకుల వేద మంత్రోచ్చారణల మధ్య, భక్తుల జయ జయ ధ్వానాల మధ్య గోదావరి మాతకు పూజలు చేసి గోదావరికి హారతినిచ్చారు. భక్త లు అధిక సంఖ్యలో పాల్గొని గోదావరి హారతి కార్యక్రమాన్ని తిలకించారు. ఆలయ ఈవో కాంతా రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. పులకరించి పోయారు.

బైక్ అదుపు తప్పి వృద్ధుడి మృతి

కథలాపూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దూలూరుకు చెందిన జూపాక పోచయ్య (62) అనే వృద్ధుడు బైక్ అదుపు తప్పి మృతి చెందాడు. ఎస్సై నవీన్ కథనం ప్రకారం... పోచయ్య ఆదివారం భూషణరావుపేట మల్లవ్వ దేవాలయం వద్ద ఓ శుభకార్యానికి హాజరై సాయంత్రం బైక్‌పై స్వగ్రామం బయలు దేరాడు. భూషణరావుపేట శివారులోని శ్మశాన వాటిక మూల మలుపు వద్ద బైక్ అదుపు తప్పి పక్కన ఉన్న గోతిలోకి దూసుకు వెళ్లింది. ఆ క్రమంలో అక్కడ ఉన్న చెట్టు రెమ్మలు తలకు తాకడంతో గాయాలయ్యాయి. రాత్రి దాకా అచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు రోడ్డు వెంట వెతికారు. కింద పడి అపస్మారకస్థితిలో కనిపించడంతో ఆసుపత్రికి తరలించే లోపే మార్గమధ్యలో మృతి చెందాడు. పోచయ్యకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. కుమారుడు కిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శవాన్ని కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హామీల అమలుపై రాజన్న సాక్షిగా ప్రకటన చేయాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య

సిరిసిల్ల రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి రాజన్న సాక్షిగా ప్రకటించాలని, సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలలో నెలకొన్న సమ స్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నేతన్నలకు ఉపాధిని కల్పించడంతోపాటు ఆత్మహత్య చేసుకున్న నేతన్నల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు ముగిసి 11 నెలలు గుడుస్తున్నాయని, సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో ప్రచారంలో ఇచ్చిన హామీ లను విస్మరించారని అన్నారు. మిడ్‌మానేరు నిర్వాసితులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. 11 నెలలుగా వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కూరుపోయిందని, రాష్ట్ర ప్రభుత్వం ఆర్డర్లు ఇవ్వకపోవడంతో నేతన్నలకు ఉపాధి లేకుండా పోయిందని అన్నారు. సరైన ఉపాధిలేక కుటుంబాలను పోషించుకునే పరిస్థితి లేక పోవడంతో ఇప్పటివరకు దాదాపు 20 మంది నేతన్నలు ఆత్మహత్య చేసుకున్నారని, దీనికి సీఎం బాధ్యత వహించాలని అన్నా రు. 3 నెలల క్రితం ప్రకటించిన చీరల తయారీ ఆర్డర్లను వెంటనే అందించాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న నేతన్నల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడూరి ప్రవీణ్, పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, నాయకుల బొల్లి రాంమోహన్, ఎండీ సత్తార్, అగ్గిరాములు, గుండ్లపల్లి పూర్ణచందర్, కంచర్ల రవిగౌడ్, సబ్బని హరీష్, కుంబాల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్స్య కార్మికులను ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం

గంభీరావుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) మత్స్య కార్మికులను కాంగ్రెస్ ప్రభుత్వం నట్టేట ముంచిందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సుతారి బాలవ్వ ఆరోపించారు. గంభీరావుపేట మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. జూలై, ఆగస్టులోనే ఉచిత చేప పిల్లలను ప్రభుత్వం పంపిణీ చేయాల్సి ఉందని, నవంబరులో పంపిణీ చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2016 నుంచి 2023 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు నెలలోనే చేప పిల్లలను పంపిణీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. జిల్లా వ్యాప్తంగా అప్పర్ మానేరు, అన్నపూర్ణ రిజర్వాయర్, మిడ్ మానేరుతోపాటు 440 చెరువులు ఉండగా, బీఆర్ఎస్ ప్రభుత్వం 1 కోటి 40 లక్షల చేప పిల్లలను పంపిణీ చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాకు కేవలం 75 లక్షల చేప పిల్లలను మాత్రమే పంపిణీ చేసిందన్నారు. జిల్లాలో 10వేల మందికి పైగా మత్స్య కార్మికులు వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. చేపపిల్లలతోపాటు రొయ్య పిల్లలను కూడ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

ధర్మపురి క్షేత్రంలో కార్తీక సందడి



ధర్మపురి వద్ద గోదావరి హారతి

ధర్మపురి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో మూడవ సోమవారం కార్తీక సందడి నెలకొంది. స్థానిక లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ రామలింగేశ్వ స్వామి, అక్కపెల్లి రాజ రాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. గోదావరి నదిలో భక్తులు కార్తీక స్నానాలు ఆచరించారు. వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ స్వామి వారల ప్రత్యేకపూజలు జరిపించారు. భక్తులకు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది తగు సేవలు అందించారు.

● కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 17వ రోజు సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది గోదావరి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి హారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

నరసింహుడి సన్నిధిలో ప్రముఖుల పూజలు



హైకోర్టు రిజిస్ట్రార్ ఎంపీ రమేష్ దంపతులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఈవో

ధర్మపురి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి లక్ష్మీనర సింహ స్వామి దేవాలయాన్ని రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ ఎంపీ రమేష్ దంపతులు, జిల్లా అడిషనల్ జడ్జి నారాయణ వేర్వేరుగా సోమవారం సందర్శించారు. ఆలయం వద్ద వారిద్దరికి వేర్వేరుగా వేద పండితులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి సన్నిధిలో పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ వారికి స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటాలు అందించి సత్కరించారు.

రాజన్న క్షేత్రం.. భక్తజన సంద్రం



భక్తులతో కిటకిటలాడుతున్న రాజన్న ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఇతర రాష్ట్రాలనుంచి భక్తులు తరలివచ్చారు. అనంతరం పార్వతి పరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్నకు ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. కోడె మొక్కు చెల్లింపునకు సుమారుగా నాలుగు గంటలపాటు క్యూలైన్‌లో నిరీక్షించారు. కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా ఆలయం ముందు భాగంలోని చెట్టు వద్ద మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. ఈవో వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సామూహిక కార్తీక దీపోత్సవం

కార్తీక మాసం సందర్భంగా రాజన్న ఆలయంలో నిర్వహిస్తున్న సామూహిక కార్తీక దీపోత్సవం కొనసాగుతోంది. సోమవారం పట్టణానికి చెందిన మహిళలు పలు ఆకృతుల్లో దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

రాజన్న ఆలయంలో మహాలింగార్చన

వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం లో అర్చకులు మహాలింగార్చన కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహాన్యాస పూర్వక ఏకదశ రుద్రాభిషేకం చేపట్టారు. సాయంత్రం ఆలయ కల్యాణ మండపంలో అర్చకుల వేదమంత్రాల మధ్య పిండితో తయారు చేసిన దీపాలను లింగాకృతిలో వెలిగించారు.

● వేములవాడ రాజరాజేశ్వరస్వామిని ఐఏఎస్ అధికారి కృష్ణభాస్కర్ సోమవారం రాజన్నను దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయాధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కోడెమొక్కు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు ఆశీర్వచనం, ఆలయ ఈవో వినోద్ రెడ్డి సామి ప్రసాదాన్ని అందజేశారు.





రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు, కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలో మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి మూడు గంటల వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు టౌన్ వన్ ఏడీఈ పంజాల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. క్రిస్టియన్ కాలనీ, సివిల్ హాస్పిటల్ బ్యాక్ సైడ్ ఏరియా, వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగ దారులు సహకరించాలని కోరారు.

ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదు

కరీంనగర్ క్రైం, నవంబరు 18: కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్ల వాగు నుంచి కొందరు ఇసుకను అక్రమంగా రవానా చేస్తున్నారని, ట్రాక్టర్ యజమానులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్‌పార్టీ ఇరుకుల్ల గ్రామ శాఖ అధ్యక్షులు కాశిపాక రాకేష్ సోమవారం పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు. రాత్రి, పగలు అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్నారని, దీనిపై పలుమార్లు తహసీల్దార్‌కు, ప్రజావాణిలో ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకోవటం లేదని పేర్కొన్నారు.

గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలి

సుభాష్‌నగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రలో డివిజన్ల వారీగా గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలని సామాజిక కార్యకర్త అన్నెమల్ల సురేష్ కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు.

మైదానానికి స్థలం కేటాయించాలని ధర్నా

సుభాష్‌నగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో క్రికెట్ మైదానం కోసం స్థలం కేటాయించాలని ఎమ్మెల్సీ అభ్యర్థి ముస్తాక్‌అలీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్ అనేది ఆరోగ్యాన్ని పెంపొందించే దివ్యశక్తి అన్నారు.

గ్రంథాలయంలో పాటల పోటీలు

కరీంనగర్ కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా చైర్మన్ సత్తు మల్లయ్య సూచనల మేరకు సోమవారం పాఠశాల, కళాశాల స్థాయి విద్యార్థులకు దేశభక్తి, జానపద గేయాలు అంశాలపై పాటల పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా బాలభవన్ సూపరింటెండెంట్ కట్ట మంజులా దేవి, కె.శ్రీధర్, కల్వకోట వీణ వ్యవహరించారు. కార్యక్రమంలో కార్యదర్శి సరిత, లైబ్రేరియన్ జి సరిత, సిబ్బంది పాల్గొన్నారు.

'నగర సమగ్ర అభివృద్ధికి కృషి'


రాజీవ్‌పార్కు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగర సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. సోమవారం ఆయన రాజీవ్ పార్కులో చేపడుతున్న అభివృద్ధి, సుందరీకరణ పనులను ఆ డివిజన్ కార్పొరేటర్ దిండిగాల మహేశ్‌తో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా మేయర్ మాట్లా డుతూ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, మంచినీటి సరఫ రాతో పాటు పార్కులు, వాకింగ్‌ట్రాక్స్, ఓపెన్ జిమ్స్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల ఏర్పాటు వంటి అభివృద్ధి పనులపై తమ పాలకవర్గం దృష్టి పెట్టిందన్నారు. నగర నడి బొడ్డున తెలంగాణ చౌక్‌లో 10 కోట్లతో ఏర్పాటు చేసిన మల్టిపర్పస్ పార్కు పనులు, మంకమ్మతోటలోని రాజీవ్ పార్కు అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయన్నారు. ఈరెండు పార్కులు డిసెం బరులో ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని మేయర్ యాదగిరి సునీల్‌రావు ప్రకటించారు. నగరంలో డెయిలీ వాటర్ సప్లయి చేస్తున్న రాష్ట్రంలోనే ఏకైక నగరం కరీంనగర్ అని తెలిపారు.

డిసెంబర్‌లో హౌజింగ్‌బోర్డు రిజర్వాయర్ పరిధిలోని ఐదు వేల ఇళ్లకు 24/7 మంచినీటి సరఫరాను అందించే కార్యక్రమానికి శ్రీకారం చుడతామని చెప్పారు. ఆ తర్వాత దశల వారీగా నగరంలో 24/7 మంచినీటి సరఫరాను విస్తరిస్తామని అన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఆర్ట్స్ కళాశాల, మల్టిపర్పస్ పార్కులను ఆధునిక హంగులతో సుందరీకరణ చేస్తున్నామని చెప్పారు. ఓపెన్‌జిమ్స్, వాకింగ్‌ట్రాక్స్ ఏర్పాటు చేశామని, స్మార్ట్‌రోడ్లు నిర్మించామన్నారు. నాన్‌వెజ్, కూరగాయలు, పండ్లు అన్ని ఒకే చోట లభ్యమయ్యే విధంగా నగరంలో నాలుగు ఇంటిగ్రేటెడ్ మార్కెట్లకు ప్రారంభోత్సవం చేశామని, పద్మనగర్, మార్కెట్ యార్డులోని మార్కెట్లను డిసెంబరులోగా ప్రజలకు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. డిసెం బర్, జనవరిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులన్నింటిని పూర్తయ్యేలా కృషి చేస్తున్నామని సునీల్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వాల రమణారావు, సల్ల రవీందర్, మాజీ కార్పొరేటర్ తుమ్మల రమేశ్‌రెడ్డి, నాయకులు సుధగోని కృష్ణగౌడ్, స్థానికులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ వాహనాల హవా

(3వ పేజీ తరువాయి)

కొంత మైనస్‌గా పలువురు వినియోగదారులు చెబుతున్నారు.

● వాహనాల ప్రత్యేకతలు

ప్రముఖ వాహనాల తయారీ కంపెనీ టీవీఎస్ ఈవీ ఐక్యూబ్ అమ్మకాలు నెలకు 80 నుంచి 90 వరకు ఉంటున్నాయి. ఐదు వేరియేషన్లు, ఐదు ఆకర్షణీయమైన రంగుల్లో అందుబాటులో ఉన్నాయి. వీటిధర 95 వేల నుంచి 1.85 లక్షల వరకు ఉంది. ఈ వాహనంలో రివర్స్ గేర్ ఉంది. కంపెనీ సిబ్బంది వాహనదారులకు సర్వీసింగ్ సమచారాన్ని సాఫ్ట్‌వేర్ ద్వారా అందిస్తూ వారిని అప్రమత్తం చేస్తారు.

● బజాజ్ చేతక్ వాహనాలు నెలకు 10నుంచి 15వరకు అమ్ముడు పోతున్నాయి. ఈ ద్విచక్ర వాహనానికి ఆండ్రాయిడ్, ఐఓఎస్ యాప్ కనెక్టివిటీ ఉంది. మూడు వేరియేషన్లు అందుబాటులో ఉన్నాయి. వీటిధర 1.19 లక్షల నుంచి 1.66 లక్షల వరకు ఉంది. లీథియం సెల్స్‌తో కూడిన బ్యాటరీపై మూడేళ్లు లేదా 50 వేల కిలోమీటర్లు గ్యారంటీ ఇస్తున్నారు. ఈ వాహనాల వేగం గంటకు 63 నుంచి 73 కిలోమీటర్ల వరకు ఉంటుంది. రివర్స్ గేర్ సదుపాయం ఉంది. ఎల్‌సీడీ డిజిటల్ డిస్‌ప్లే ఉంది.

● ఓలా ఎలక్ట్రికల్ ద్విచక్రవాహనాలు నెలకు 50నుంచి 60వరకు అమ్ముడవుతున్నాయి. ఈ కంపెనీలో ఐదు వేరియేషన్లు అందుబాటులో ఉన్నాయి. వీటిధర 85 వేల నుంచి 1.45 లక్షల వరకు ఉంది. లీథియం సెల్స్‌తో కూడిన బాటరీ కి మూడేళ్లు లేదా 40 వేల కిలోమీటర్లు గ్యారంటీ ఇస్తున్నారు. ఆటో లాక్, రివర్స్ గేర్, మొబైల్‌ఫోన్ చార్జింగ్ వంటి అత్యాధునిక సౌకర్యాలున్నాయి. కిలోవాట్ బ్యాటరీ చార్జింగ్‌కు ఒకయూనిట్ విద్యుత్ అవసరం ఉంటుంది. బ్యాటరీ ఫుల్ చార్జింగ్‌కు 5 గంటల సమయం తీసుకుంటుంది.

● యాంపెర్ షోరూంలో నెలకు 50 నుంచి 50 వాహనాలు విక్రయిస్తున్నారు. 2019లో కరీంనగర్‌లో షోరూం ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలో మరో నాలుగు చోట్ల షోరూంలు ఉన్నాయి. నాలుగు రకాల ద్విచక్రవాహనాలు అందుబాటులో ఉన్నాయి. వీటి ధరలు 59,900 రూపాయల నుంచి 1.4 లక్షల వరకు ఉంది. లీథియం బ్యాటరీ 6 గంటల్లో పూర్తి చార్జింగ్ అవుతుంది. బ్యాటరీపై మూడేళ్ల గ్యారింటీ ఇస్తున్నారు.

చదరంగంతో ఆలోచనా శక్తి పెంపు


ట్రోఫీలను అందుకున్న క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చదరంగంతో ఆలోచనా శక్తి పెంపొందుతుందని బిల్డర్ పడాల అజయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి ఆహ్వానిత చదరంగ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లాలోని ముఖ్య చదరంగ క్రీడాకారులు 80 మంది పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. గెలుపొందిన క్రీడాకారులకు నగదు బహుమతులను, మెమోంటోలను, ట్రోఫీలను ముఖ్య అతిథి బిల్డర్ పడాల అజయ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదరంగంతో మనోవికాసం పెంపొందుతుందన్నారు. పోటీలకు హాజరైన క్రీడాకారులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథులుగా కోన శ్రీనివాస్, శ్యాంకుమార్‌లు పాల్గొనగా, జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్ కంకటి అనూప్ కుమార్, ఆర్బిటర్ అరుణ్ రంగవేణి, కోచ్‌లు సృజన్ కుమార్, అభిరామ్, నితిన్, తరుణ్, శ్రీనిజ, తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌లో ఉపాధ్యాయులను నియమించాలి

సుభాష్‌నగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి మండలం రుక్మాపూర్‌లో గల సైనిక్ స్కూలులో ఆర్మీ ఇన్‌స్ట్రక్టర్స్ ఉపాధ్యాయుల(సీబీఎస్ఈ)ను నియమించాలని సైనిక్‌స్కూలు పేరెంట్ కమిటీ అధ్యక్షుడు భూత్కూరి శంకరయ్య కోరారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం స్కూలులో ఆర్మీ, నేవీ, ఎన్‌డీఏ శిక్షణ ఇవ్వాల్సిన ఇన్‌స్ట్రక్టర్లు లేరని, ఆరుగురు ఉండాల్సిన స్థానంలో ఒక్కరు మాత్రమే ఉన్నారన్నారు. సీబీఎస్ఈ ఉపాధ్యాయులు కూడా పూర్తిస్థాయిలో లేరన్నారు. ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

నాణ్యమైన విద్యను అందించాలి

సుభాష్‌నగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరికి కేజీ నుంచి పీజీ వరకు నాణ్యమైన ఉచిత విద్యను అందించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తాళ్ల నరేష్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం 90శాతం పేద, మధ్య తరగతి వర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ వారు ఉన్నారని తెలిపారు. అర్హులైనవారందరికి 200 గజాల స్థలంలో నాలుగు గదుల ఇంటిని నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిహెచ్ శ్రీకాంత్, జి రవి, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ కళాజ్యోతి అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రతీ యేటా నిర్వహించే గ్రామీణ కళాజ్యోతి అవార్డులకు ఎంట్రీలను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు గుండ్ర కృపాదానం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డులకు వివిధ కళారంగాలు, సామాజిక విభాగాలలో పనిచేస్తున్న వారు తమ బయోడేటా, కార్యక్రమాల సర్టిఫికెట్లు, పేపర్ క్లిప్పింగ్స్, ఆధార్ కార్డుతో సహా ఈనెల 22వ తేదీ లోపు జి కృపాదానం, 15-7-47/2/2/2, రేకుర్తి, కొత్తపల్లి మండలం, కరీంనగర్ జిల్లా చిరునామాకు పంపాలని, ఇతర వివరాలకు 8106006238 నెంబర్లో సంప్రదించాలని కోరారు.

'రద్దీకి అనుగుణంగా బస్సులు నడపాలి'

భగత్‌నగర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడపాలని కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎన్ సుచరిత అన్నారు. కరీంనగర్ బస్టాండ్‌లో రద్దీని ఆర్ఎం సోమవారం పరిశీలించారు. వివిధ రూట్లలో బస్సులను పరిశీలించి రద్దీకి అనుగుణంగా బస్సులను పంపించాలన్నారు. ప్లాట్‌ఫాంలను తిరిగి రద్దీని పర్యవేక్షించి సిబ్బందికి సూచనలు అందించారు.

దళితులను అరెస్టు చేయడం దారుణం

హుజూరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దళితులను పోలీసులు అన్యాయంగా అరెస్టు చేయడం దారుణమని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సోమవారం ఒక ప్రటనలో పేర్కొన్నారు. దళితుల హక్కులను కాపాడాల్సిన పోలీసులే వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడం తీవ్ర ఆవేదన కలిగిస్తోందని తెలిపారు. దళితుల న్యాయమైన హక్కులను గుర్తించి వెంటనే వారిని విడిచిపెట్టాలని డిమాండ్ చేశారు.

న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతి

సుభాష్‌నగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్ళుగా సాగు చేసుకుంటున్న భూమిని తహసీల్దార్ అక్రమంగా పేర్లు బదిలీ చేశారని తమకు న్యాయం చేయాలని ఓ కుటుంబం ప్రజావాణిలో కలెక్టర్‌ను వేడుకుంది. పోలీసులు తనిఖీ చేస్తున్న సమయంలో వారు వద్ద ఉన్న పురుగుల మందు డబ్బాను తీసుకొని కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం కలెక్టర్‌ను కలిపించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామానికి చెందిన మ్యాకమల్ల సుగుణ కుటుంబం 30 సంవత్సరాల క్రితం అదే గ్రామానికి చెందిన ఉట్ల రాంమోహన్‌రావు వద్ద మూడు ఎకరాల 6 గుంటల భూమిని కొనుగోలు చేశారు. ఆనాటి నుంచి వారు అందులో వ్యవసాయం చేసుకుంటున్నారు. అప్పటి నుంచి పట్టా పాసుబుక్కు, ఇతర రశీదులు అన్ని తమ పేరుపైనే ఉన్నాయని తెలిపారు. ధరణిలో సైతం తమ పేరుపైనే ఉందని తెలిపారు. 12 సంవత్సరాలుగా కేసు కోర్టులో ఉందని అయినప్పటికీ ఆ భూమిని స్థానిక తహసీల్దార్ వారి పేరుపై బదిలీ చేశారని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

వేణుగోపాలస్వామి ఆలయ జీర్ణోద్ధరణ ప్రారంభం


పూజలు చేస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

శంకరపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయం జీర్ణోద్ధరణ పనులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ధర్మపురి మధుశంకరశర్మ, మధుమహాదేవశర్మ, కాకరి రాఘవశర్మ హోమాలు చేసి పురాతన ఆలయంలోని వేణుగోపాలస్వామి విగ్రహాలను తాత్కాలికంగా నిర్మించిన ఆలయంలో ప్రతిష్ఠ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంట మహిపాల్, శ్రీవేణుగోపాలస్వామి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

భగత్‌నగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపూర్ ఎస్సీ కాలనీలో పునర్నిర్మాణం చేపట్టిన పోచమ్మ దేవాలయానికి బీజేపీ నాయకుడు నరహరి లక్ష్మారెడ్డి పది వేల విరాళం అందించారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలి


విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో స్కూల్‌లో నిర్వహించిన ఎడ్యు ఎగ్జిబిషన్ ప్రతిభకు పట్టం కట్టింది. సోమవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు తరగతి గదుల విషయాలతో పాటు సామాజిక స్పృహ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు వార్షిక ప్రణాళికలో భాగంగా వివిధ విషయా లలోని అంశాలను సమగ్రంగా చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. పోటి ప్రపంచంలో విద్యార్థులకు ప్రతి విషయాన్ని సమగ్రంగా తెలిపితే సృజనాత్మకంగా వివిధ పరిశోధనలను చేయడమే కాకుండా సమాజ హితానికి తోడ్పాటు నందిస్తా రన్నారు. పాఠశాలలో గణితం, సాంఘీకం, సాంకేతిక, పర్యావరణ విషయాలను పరిశోధనాత్మకంగా దృశ్యమాలికల ద్వారా తెలియజేయాలనే సంకల్పంతో ఎడ్యు ఎక్స్‌టెన్స్ పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. లిక్విడ్, డెన్సిటి, హైడ్రోఫ్యూల్ జనరేటర్, ప్లాస్టిక్ నిర్వహణ, అమ్లా వర్షం, బోర్స్ మాడల్, బొగ్గు తయారీ నీటి శుద్ధి యంత్రం పిర్యాడిక్ టేబుల్ వంటి అంశాలను విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాల కల్పనకు వెబ్‌సైట్ ఏర్పాటు

సుభాష్‌నగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని మున్నూరుకాపు యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకే పటేల్ యూత్ వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేశామని రాష్ట్ర మున్నూరుకాపు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్, కరీంనగర్ కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, మున్నూరుకాపు జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొత్త లక్ష్మన్, ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో వారు వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఏల్పుల శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామినేని మధుసూదన్, జగిత్యాల అధ్యక్షుడు వంగ రమేశ్, ప్రధాన కార్యదర్శి చందు, కార్యదర్శి రాచమల్ల సుగుణాకర్, పటేల్ యూత్‌ఫోర్స్ రాష్ట్ర ఇంచార్జి సాయిచరణ్, రాము, గాజుల శ్రీనివాస్, కాంతి, బీసీ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి దొగ్గలి శ్రీధర్ పాల్గొన్నారు.

కార్తీక పూజలు

కరీంనగర్ కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు శివ, కేశవాలయాల్లో కార్తీక సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పాతబజార్ గౌరీశంకర, కమాన్‌రోడ్ రామేశ్వర, భగత్‌నగర్ భవానీశంకర, ఆదర్శనగర్ రాజరాజేశ్వర, జెడ్‌పి క్వార్టర్స్‌లోని శివాలయాలు, చైతన్యపురి మహాశక్తి, భగత్‌నగర్ అంజనాద్రి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

విద్యార్థులకు ఐడీ కార్డుల పంపిణీ

హుజూరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు సోమవారం ప్రిన్సిపాల్ ఆంజనేయరావు ఐడీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆంజనేయరావు మాట్లాడుతూ ప్రతిరోజు విద్యార్థులు కళాశాలకు యూనిఫాం, ఐడీ కార్డు ధరించి రావడం వల్ల పిల్లలో ఐక్యత భావం పెరుగుతుందన్నారు.

యాంటిబయాటిక్స్ అధికంగా వాడొద్దు


సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు

జమ్మికుంట, నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి): యాంటిబయాటిక్స్ అధికంగా వాడొద్దని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు అన్నారు. సోమవారం జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో వావిలాల, ఇల్లందకుంట, వీణవంక, చెల్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలకు యాంటిబయాటిక్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో మాట్లాడుతూ 24వ తేది వరకు జరిగే వీక్ క్యాంపెయిన్‌లో ప్రజలకు యాంటిబయాటిక్స్ వాడకంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సూపరిండెంట్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

● సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలి

జమ్మికుంట రూరల్: ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని డీసీహెచ్ డాక్టర్ కృష్ణప్రసాద్ అన్నారు. సోమవారం పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో పీహెచ్‌సీల సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు చేయించుకుంటే వర్తించే ప్రోత్సహకాలపై గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు, సూపరిండెంట్ శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ ప్రణీత, గైనకాలజిస్ట్ శ్యామల పాల్గొన్నారు.

అనారోగ్యంతో సింగిల్‌విండో మాజీ చైర్మన్ మృతి

ఇల్లందకుంట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం మాజీ చైర్మన్ పున్నం వాసుదేవరెడ్డి (72) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ సరిగోమ్ముల పావని-వెంకటేష్, పున్నం రమాకర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ అరుకాల వీరేశలింగం వాసుదేవరెడ్డి మృతదేహం వద్ద పూల మాలలు ఉంచి నివాళులర్పించారు.

దళిత బంధు సాధన సమితి నాయకుల అరెస్టు

వీణవంక, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దళిత బంధు రెండో విడుత నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందించేందుకు వెళ్తున్న దళిత బంధు సాధన సమితి నాయకులను మండల కేంద్రంలోని బస్టాండ్‌లో సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. దాసారపు గౌర య్య, పుల్లూరు సంపత్, దూడపాక రవి, గురు కుంట్ల రాకేష్, దాసారపు నాగరాజు, మహం కాళి రమేష్, గాజుల కుమార్‌పై కేసు నమోదు చేశారు.

విద్యార్థులకు పెన్నుల పంపిణీ

వీణవంక, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడాలపల్లి, చల్లూరు ప్రభుత్వ పాఠశాలల్లో నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఎన్ఎస్ యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండేటి మహేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పెన్నుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో శోభారాణి, దరిపెల్లి మురళి, దాసారపు వెంకటేష్, మంతెన అజిత్, కోండ్ర రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కిలో అదనంగా జోకినా కఠిన చర్యలు


కురిక్యాల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నిబంధనల ప్రకారం ధాన్యం తూకం వేయాలని, కిలో అదనంగా జోకినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులను హెచ్చరించారు. సోమవారం గంగాధర మండలం కురిక్యాల పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వహకులు కేంద్రాల్లో రైతులకు సౌకర్యాలు కల్పించడంతో పాటు కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు. రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దన్నారు. రైతులు ప్రైవేట్ వ్యక్తులకు ధాన్యం అమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని, అమ్మిన వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని తెలిపారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని, తూకం వేసిన ధాన్యం, రైతుల వివరాలను ఏరోజుకారోజు ఆన్‌లైన్‌లో ఎంటర్ చేయాలని సూచించారు. ఆయన వెంట నాయకులు బైరిశెట్టి సంపత్, ముత్యం శంకర్ ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే కవ్వంపల్లి


నల్లగొండ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగొండ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు తగిన వసతులు కల్పించేందుకు దేవస్థానం పాలకవర్గం చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బడారుపల్లి లక్ష్మణ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, సుదగోని లక్ష్మీనారాయణగౌడ్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మా ర్కెట్లో క్వింటాల్ పత్తి గరిష్ఠ ధర 6,850, కనిష్ఠ ధర 6,300 రూపాయలు పలికింది. 187 మంది రైతులు 2,850 క్వింటాళ్లు సీసీఐకి విక్రయించారు.

-జమ్మికుంట 21వ వార్డులో కల్వర్టు పనులకు మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు శంకుస్థాపన చేశారు.

● జమ్మికుంట రూరల్: మంత్రులపై కేటీఆర్ చేసిన అహంకార పూరిత వాఖ్యలు సరికావని కాంగ్రెస్ నాయకుడు మండల అశోక్‌గౌడ్ ఒక ప్రకటనలో ఖండించారు.

● ఇల్లందకుంట: మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్పీ) రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా సీతంపేటకు చెందిన ఇంజం వెంకటస్వామి ఎన్నికయ్యారు. ఆయనను కాంగ్రెస్ జమ్మికుంట మాజీ మండల అధ్యక్షుడు పుల్లూరి సదానందం సన్మానించారు.

- తెలంగాణ సాంస్కృతిక సారధి చైర్‌పర్సన్‌గా నియమితులైన గుమ్మడి వెన్నెలను హైద్రాబాద్‌లోని ద్రావిడ సాహిత్య సాంస్కృతిక కళామండలి వ్యవ స్థాపక అధ్యక్షుడు రామంచ భరత్ కలిశారు.

● హుజూరాబాద్: పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో గణిత ప్రతిభా పరీక్షలు నిర్వహించారు.

పట్టణంలోని బస్టాండ్ కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న షాపులను అద్దెకు ఇచ్చేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఎం రవీంద్రనాథ్ తెలిపారు. 9959225924, 9985379495 నంబర్లలో సంప్రదించాలన్నారు.

● మానకొండూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను డీఈవో జనార్దన్‌రావు ఆకస్మిక తనిఖీ చేశారు.

- మండలంలోని పచ్చునూర్, లక్ష్మీపూర్, గ్రామాలకు చెందిన మూడగాని కనుకయ్య, పన్నింటి పుష్పలత, ఎర్ర లచ్చమ్మ ఇటీవల మృతి చెందారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణారావు వారి కుటుంబాలను పరామర్శించారు.

- నియోజకవర్గంలోని ఆరు మండలాల టీడీపీ అడ్‌హక్ కమిటీలను నియమించినట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి ఎడ్ల వెంకటయ్య తెలిపారు.

● గంగాధర: మండలంలో 75 శాతం కుటుంబ సమగ్ర సర్వే పూర్తైనట్లు ఎంపీడీవో రాము తెలిపారు.

● హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని శివాలయంలో దీపాలను వెలిగిస్తున్న ఓ మహిళ చీరకు నిప్పంటుకుంది. తోటి మహిళలు మంటలను ఆర్పేశారు.

పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా పెట్టాలి


పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మొహంతి

రామడుగు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా పెట్టాలని సీపీ అభిషేక్ మొహంతి అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆయన సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో గ్రూపులుగా ఏర్పడి సామాన్య ప్రజలను బెదిరింపులకు గురి చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించవద్దన్నారు. పాత నేరస్తుల కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ప్రతి నెల వారికి సంబంధించిన సమాచా రాన్ని సేకరించినమోదు చేసుకోవాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను యాక్సిడెంట్ జోన్‌లుగా, బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి, ఇసుక, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, పేకాటపై ఉక్కుపాదం మోపాలన్నారు. అనంతరం స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఐ శేఖర్‌తోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.